
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 21 సెప్టెంబర్ 2024



హయ్యర్ పెన్షన్ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల హయ్యర్ పెన్షన్ అమలులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు అనుబంధ ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి దివాకర్ అన్నారు. స్థానిక పువ్వులవల్లి సుందరయ్య భవన్‌లో ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. 1/2019 సర్క్యులర్ ను అమలు చేయాలనీ, జీవో నెంబర్ 70ను రద్దు చేయాలని కోరారు. హైయర్ పెన్షన్ వల్ల కార్మికులు అనేక ఆటంకాలు ఎదుర్కొంటున్నారనీ, వాటిని ఈపీఎఫ్ఓ అధికారులు పరిష్కరించాలని చెప్పారు. జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎన్వీకే రెడ్డి, జిలానీ, దేవి రాజకుమారి, మనోహరి, ఎన్ విజయలక్ష్మి సుజాత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య పాల్గొన్నారు.

'యువగళం' ప్రతి హామీ నెరవేరుస్తా

డయాలసిస్ సెంటర్ ప్రారంభం
అకనంబట్టు స్కూల్లో ఆకస్మిక తనిఖీలు
'ప్రజాదర్బార్'లో వినతులు స్వీకరణ
ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నారా లోకేష్ పర్యటన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, బంగారుపాళ్యం

యువగళం పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. యువగళం 100 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా ఇచ్చిన తొలి హామీ మేరకు గ్రామస్తుల ఆనందోత్సాహాల మధ్య బంగారుపాళ్యంలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో చిత్తూరు జిల్లా సమగ్రాభివృద్ధి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. గత ఏడాది జనవరి 27వ తేదీన కుప్పం శ్రీ వరదరాజస్వామి పాదాల చెంత నుంచి తాను ప్రారంభించిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిందన్నారు. 11ఉమ్మడి జిల్లాలు, 97 అసెంబ్లీ నియోజకవర్గాలు మీదుగా 2200 గ్రామాలను స్పృశిస్తూ 3132 కి.మీ.ల మేర యువగళం పాదయాత్ర సాగిందని గుర్తు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో మరెవరూ చేయనివిధంగా 14 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తూ 45రోజులపాటు 577 కి.మీ.ల మేర కొనసాగిన యువగళం పాదయాత్ర రికార్డు సృష్టించిందన్నారు. యువగళం పాదయాత్ర 8వ రోజు 2023, ఫిబ్రవరి 3న బంగారుపాళ్యంలో వంద కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తొలి మైలురాయిని ఆవిష్కరించానన్నారు. డయాలసిస్ కేంద్రం అవసరమని స్థానికులు చెప్పిన మేరకు ఇపుడు నెరవేర్చానన్నారు. బంగారుపాళ్యం ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నారని, తరచూ డయాలసిస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లడానికి డబ్బు, సమయం వృథా అవుతున్నాయన్నారు. ప్రస్తుతం తమ ఊళ్లోనే ఉచితంగా డయాలసిస్ చేయించుకునే అవకాశం ఉంటుందన్నారు. బంగారుపాళ్యంలో కోట్లాది నిర్మించిన 30 పడకల ఆస్పత్రిని ప్రారంభిస్తూ టిడిపి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, పూతలపట్టు ఎంఎల్ఎ మురళీమోహన్, చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని పాల్గొన్నారు.



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నారా లోకేష్

చేసిన పని చెప్పుకోవాలి

'ప్రజలు మనపై పవిత్ర బాధ్యత పెట్టారని, దాన్ని హుందాగా నెరవేర్చాలి' అని లోకేష్ అన్నారు. శుక్రవారం ఉదయం ఎస్ఎల్‌వి కల్యాణ మండపంలో 'ఉత్తమ కార్యకర్త', 'మన టిడిపి యాప్ ఛాంపియన్స్' సమావేశం నిర్వహించారు. టిడిపి యాప్ ద్వారా ఉత్తమ పనితీరు కనబరచిన కార్యకర్తలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. చెప్పింది చేయాలని, చేసిన పని చెప్పుకోవాలని ఈ సందర్భంగా అన్నారు. క్యాన్సర్ గడ్డలా మారిన పాపాల పెద్దిరెడ్డిని వదిలిపెట్టేది లేదని, చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామని ఉద్ఘాటించారు. తాము అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే అనేక హామీలు నెరవేర్చామన్నారు.

టిటిడి పవిత్రతను కాపాడతాం

'తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారు' అని విని షాకయ్యాం. ఇందుకు సంబంధించిన రిపోర్టులను బయట పెట్టాం. తిరుమలలో ప్రమాణానికి సిద్ధమని టిటిడి మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి సవాల్ విసిరారని, తాను తిరుపతిలోనే ఉన్నానని, ప్రమాణానికి సిద్ధం అని అన్నారు. తిరుమల పవిత్రతను కాపాడేవిధంగా చర్యలు చేపడతాం అన్నారు.

మోడల్ స్కూళ్లలా తీర్చిదిద్దుతాం

ప్రభుత్వ పాఠశాలలను ఎపి మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్దుతామని మంత్రి లోకేష్ అన్నారు. పూతలపట్టు నియోజకవర్గం అకనంబట్టు జడ్‌పి హైస్కూల్లో మంత్రి నారా లోకేష్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతి గదులను సందర్శించారు. లోటుపాట్లపై విద్యార్థులను ఆరా తీశారు. కొంతమంది విద్యార్థులు ఇంకా తమకు టెక్స్ట్ బుక్స్ అందలేదని చెప్పడంతో తక్షణమే అందేలా చూడాలని ఆదేశించారు. బెంచీలు లేకపోవడంతో నేలపై కూర్చొని పాఠాలు వినాల్సి వస్తుందని చెప్పగా, త్వరలోనే ఫర్నిచర్ ఏర్పాటు చేస్తామన్నారు. మూడు నెలలుగా గతం కంటే టాయిలెట్స్ మెరుగ్గా ఉన్నాయని విద్యార్థులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 70 శాతం ఉండటానికి కారణమేంటని ప్రధానోపాధ్యాయురాలిని, టీచర్లను ప్రశ్నించారు. రవాణా సౌకర్యం మెరుగు పరచాలని టీచర్లు తెలిపారు. విద్యార్థులు ట్యాబ్‌లలో అవసరమైన కంటెంట్ చూస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, టీచర్లు దేశకన్ను వేసి ఉంచాలని సూచించారు. కొన్ని తరగతి గదులు పెచ్చులూడుతున్నాయని టీచర్లు చెప్పగా, మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు, టీచర్లతో లోకేష్ ఫోటోలు దిగారు.

వినతులు స్వీకరించిన మంత్రి

ఎస్ఎల్‌వి కల్యాణ మండపంలో 'ప్రజాదర్బార్' జరిగింది. అంగన్‌వాడీలు 42 రోజుల సమ్మె ఒప్పందంలో అంగీకరించిన అంశాల ఆధారంగా పెండింగ్‌లో ఉన్న జీవో ఇవ్వాలని, వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తన మనవరాలి ఆటిజానికి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బేతమంగల చెందిన వడ్డి గోవిందమ్మ కోరారు. జీవో 117రద్దుతో పాటు, సిపిఎస్‌పై నిర్ణయం తీసుకోవాలని, డిఎస్సీ 2023 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు కోరారు. స్టాఫ్ నర్సు నియామకాల్లో అక్రమాలను సరిదిద్దాలని రామసముద్రానికి చెందిన ఎస్.దివ్య కోరారు. తిరుపతిలో హథీరాం బాబాజీ అన్యాక్రాంత భూములను బంజారాల ఆధ్వర్యంలో ట్రస్ట్ బోర్డు ఏర్పాటుచేయడంతో పాటు ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని శ్రీ స్వామి హథీరామ్ బాబాజీ పరిరక్షణ కమిటీ విజ్ఞప్తి చేసింది. మొగిలి పంచాయతీ యానాదుల భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, నగరిలో ఉన్న వేలాదిమంది పవర్‌లూం కార్మికులకు విద్యుత్ స్లాబ్ తగ్గించాలని, చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు విజ్ఞప్తులు అందజేశారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



విద్యార్థులతో...



రోగిని పరామర్శిస్తూ..

'యువగళం' స్మృతులను నెమరువేసుకుంటూ

మంత్రిగా చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన లోకేష్ గత యువగళం జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గతంలో తన సభను అడ్డుకోవడంతో ఎదురుగా భవనం పైకి ఎక్కి తాను ప్రసంగించిన ప్రదేశాల్లో సెల్ఫీ తీసుకున్నారు. బంగారుపాళ్యం పర్యటన ముగించుకుని తిరిగి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు వెళుతున్నపుడు ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. యువగళం పాదయాత్ర సాగే సమయంలో గాదంకి టోల్‌గేటు వద్దకు టీ తాగారు. శుక్రవారం ఈ విషయాన్ని చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని గుర్తు చేయగా, కాన్వాయ్‌ని ఆపి మంత్రి లోకేష్ మురగన్ టీ స్టాల్‌లో కార్యకర్తలతో కలిసి 'చాయ్' తాగారు.




మురగన్ టీ స్టాల్‌లో తేనీరు సేవిస్తూ...



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న అంగన్‌వాడీలు

ఉన్నత స్థాయి విచారణ జరపాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



తిరుమల శ్రీవారి లడ్డూల తయారీలో జరిగిన అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్‌చేశారు. టిటిడి లడ్డూలో వాడుతున్న నెయ్యి కల్తీ జరిగిందని, ఇతరేతర పదార్థాలు వాడారని జరుగుతున్న ప్రచారంతో శ్రీవారి భక్తుల్లో ఆందోళన కలుగుతోందన్నారు. ప్రభుత్వం ఎన్‌డిడిబి రిపోర్టును అధికారికంగా ప్రకటించి విచారణ జరపాలని కోరారు. టిటిడి ఉన్నతాధికారులు రిపోర్టు వివరాలను వెల్లడించాలన్నారు. వివాదం మాటున మత మనోభావాలు రెచ్చగొట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలని, ఇలాంటి శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

కల్తీ పదార్థాల వినియోగం హేయం

డక్కిలి : లడ్డూ ప్రసాదాల తయారీలో నాశిరకమైన పదార్థాలను ఉపయోగించిన ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎపి ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

తిరుమలను భ్రష్టుపట్టించింది ధర్మారెడ్డే : కాంగ్రెస్

తిరుమల ప్రతిష్టను భ్రష్టు పట్టించింది టిటిడి మాజీ ఈవో ధర్మారెడ్డి అని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ తమిళనాడు దిండిగల్‌కు చెందిన ఎఆర్ ఫుడ్స్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టిన టిటిడి, సదరు సంస్థపై పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదన్నారు. ఎఆర్ ఫుడ్స్ సంస్థకు టెండర్ అనుమతి ఇచ్చింది అప్పటి ఈవో ధర్మారెడ్డి అన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో కీలకమైన వారిపై టిటిడి చర్యలు తీసుకోకపోతే పరిపాలనా భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

శ్రీకాళహస్తిలో... టిడిపి నాయకులు డాక్టర్ ఎం.ఉమేష్‌రావు మాట్లాడుతూ కల్తీ కారకులను ఉరి తీయాలన్నారు. వైసిపి హయాంలో కర్నాటక రాష్ట్రానికి చెందిన నందిని బ్రాండ్ నెయ్యిని అర్ధాంతరంగా ఎందుకు ఆపేయాల్సి వచ్చిందో విచారించాలన్నారు. తిరుమలలో వివిధ ప్రసాదాల తయారీకి టిటిడి నెలకు 42 వేల కిలోల నెయ్యి, 22 వేల 500 కిలోల జీడిపప్పు, 15 వేల కిలోల ఎండుద్రాక్ష, 6వేల కిలోల యాలకులు, శనగపిండి, చక్కెర తదితర పదార్థాలను సేకరిస్తున్నదని, వీటి నాణ్యతపై కూడా శాస్త్రీయంగా పరీక్షలు జరిపించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పుంగనూరులో... భక్తుల మనోభావాలు దెబ్బతీశారని, ఈ పాపం వైఎసఆర్ కాంగ్రెస్‌కే చెల్లుతుందని బిసివైపి రాష్ట్ర అధ్యక్షులు బోడే రామచంద్రయాదవ్ అన్నారు. ఎల్‌ఐసి కాలనీ సునంద నిలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ఆర్ పాలనలో స్వామివారిని అపవిత్రం చేశారన్నారు. బాధ్యులపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసివై పార్టీ నాయకులు సాంబమూర్తి, మాజీ ఏఎంసి చైర్మన్ హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

107,108 జీవోలను రద్దు చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 107, 108 జీఓ లను రద్దు చేసి మెడికల్ విద్యను కాపాడాలని, ప్రయివేటీకరణ చేయొద్దని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తిలక్ రోడ్డు లోని పాత మునిసిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వైద్య విద్య ప్రయివేటికరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం జరిగింది. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు ప్రతిష్ట కాపాడాలనే ఆలోచన ఉంటే పేద విద్యార్థులకు వైద్య విద్య అందేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుతమే నూతన కళాశాలలను నిర్మించి మెడికల్ సీట్లు పెంచి పేద విద్యార్థులకు న్యాయం చేయాలనీ కోరారు. పులివెందుల మెడికల్ సీట్లు కొనసాగించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గణేష్, నగర నాయకులు హర్షద్, లోకేష్, వాసు పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అగ్రకుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ కేవీబీపురం మండలం అంజూరుపాలెం చెందిన దళితులకు సత్వరమే న్యాయం చేయాలని వీసీకే పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి పులి పుష్పలత డిమాండ్ చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళితులను శుక్రవారం ఆమె పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్రం సిద్ధించి 77 ఏళ్ళు గడిచిపోతున్నా కులాంతర వివాహాలు చేసుకునే దళితులపై ఈ తరహా దాడులు జరగడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్, ఎస్పీ సత్వరమే స్పందించి దళితులపై దాడి చేసిన అగ్రకులస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే వీసీకే పార్టీ ఆధ్వర్యంలో బాధిత దళితుల పక్షాన న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




సమగ్ర దర్యాప్తు చేపట్టాలి : సిపిఎం

దళితుల ఇళ్ళు, ఆస్తులు ధ్వంసం చేసి గాయపరిచిన ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అంజూరు పాలెం ఘటనపై స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం నేతలు శుక్రవారం ధర్నా చేపట్టారు. దళితులపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. ఆస్తుల నష్టంపై పరిహారం అందించాలని కోరారు. దళితులకు రక్షణ కల్పించడంతో పాటు ప్రేమ జంట తులసీ రామ్, లావణ్యలకు భద్రత కల్పించాలని అన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, గెడి వేణు, నాగరాజు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో రూ.15కే మూడుపూట్ల భోజనం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తిలో అన్న క్యాంటీన్లను ఎంఎల్ఎ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి పున:ప్రారంభించారు. నాణ్యతతో కూడిన భోజనాన్ని పేదల కడుపు నింపేందుకు రూ. 5 కే అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనానికయ్యే రోజు ఖర్చు రూ.90 కాగా పేదలు మూడు పూట్లకు కలిపి రూ.15 చెల్లిస్తే సరిపోతుందన్నారు. తక్కిన మొత్తాన్ని కూటమి ప్రభుత్వం రాయితీ కింద భరిస్తోందన్నారు. ఇడ్లీ, పూరీ, ఉప్మా, పొంగల్ వంటి ఐటమ్స్ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ఇస్తున్నారని తెలిపారు. మధ్యాహ్నం, రాత్రి భోజనంలో అన్నం, కూర, పచ్చడి, సాంబారు, పెరుగు ఇస్తారని చెప్పారు. ఉదయం 7.30 గంటల నుంచి 10 గంటల వరకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తారనీ, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 3 గంటల వరకు, రాత్రి 7.30 గంటల నుంచి 9.00 గంటల వరకు భోజనం పెడతారని తెలియజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, పట్టణ కార్యదర్శి విజయ్ కుమార్ నాయుడు, చెంచయ్య నాయుడు, సుబ్బయ్య, కాసరం రమేష్, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.



మానసిక రోగులు లేని సమాజమే లక్ష్యం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

సమాజంలో మానసిక రోగులు లేకుండా చెయ్యడమే తమ లక్ష్యమని మనోబంధు ఫౌండేషన్ మేనేజర్ రామకష్ణమరాజు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021 అక్టోబర్లో ప్రారంభించిన మనోబంధు ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే దేశ వ్యాప్తంగా చాలా మంది మన తెలుగు రాష్ట్రాల్లో మానసిక రోగంతో వీదుల్లో తిరుగుతూ కనిపించగా వారిని గుర్తించి మంచి వైద్యం చేసి మామూలు మనుషులుగా మార్చి వారి స్వస్థలాలకు తీసుకెళ్ళి బంధువులకు అప్పగించామన్నారు. మనోబంధు సేవా కార్యక్రమాలను చూసి మాజీ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, సామాజిక కార్యకర్తలు ఫౌండేషన్లో ట్రస్టీలుగా చేరారన్నారు. మరిన్ని వివరాలకు 9246563738ను సంప్రదించాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి అంజయ్య, బాబు, కేశవులు పాల్గొన్నారు.

జైపూర్ రగ్స్ 'రగ్ ఉత్సవ్ 2024' ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

చేతితో తయారు చేసిన రగ్గుల తయారీలో జైపూర్ రగ్స్ ప్రపంచంలోనే అతిపెద్దదని, 'రగ్ ఉత్సవ్ 2024' తో మళ్లీ మీ ముందుకు వస్తున్నామని జైపూర్ రగ్స్ డైరెక్టర్ యోగేష్ చౌదరి తెలిపారు. శుక్రవారం ప్రైవేట్ హెూటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇది గ్రామీణ భారతీయ హస్తకళాకారుల కళాత్మకతకు ఒక వేదిక అన్నారు. చేతితో తయారు చేసిన తివాచీలు, రగ్గులు ఈ ఉత్సవంలో ఉంటాయన్నారు. ఢిల్లీ, ముంబై, పూణే, జైపూర్, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, సూరత్తో పాటు ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో కలవన్నారు. గత ఏడాది ఉత్సవం అత్యుత్తమ విజయాన్ని సాధించిందన్నారు. ఆన్‌లైన్‌తో సహా భారతదేశంలోని అన్ని జైపూర్ రగ్స్ స్టోర్‌లలో పదిహేను కోట్ల విక్రయాలు చేశామన్నారు. ఈ ఏడాది యాబై కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తున్నామని తెలిపారు. జైపూర్ రగ్స్ రూ. 975 కోట్ల టర్నోవర్‌తో ఉందన్నారు. పూణె, లండన్‌లలో కొత్త స్టోర్‌లను విజయవంతంగా ప్రారంభించిన అద్భుతమైన ఆర్థిక సంవత్సరం నుంచి తాజాగా జైపూర్ రగ్స్ రగ్ ఉత్సవ్ స్ఫూర్తితో మరోసారి హృదయాలను దోచుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

పితృపక్షం అన్నదానంలో మేయర్ శిరీష

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుచానూరు యోగిమల్లవరంలోని శ్రీ సాలగ్రామ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన పితృపక్ష అన్నదానం నాల్గవ రోజు కార్యక్రమంలో తిరుపతి మేయర్ శిరీష ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు 16 రోజుల పాటు నారద పీఠం ఆధ్వర్యంలో నిర్వహించనున్న పితృపక్షం అన్నదానంలో పాల్గొనడం ఆనందంగా ఉందని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నారదపీఠం వ్యవస్థాపకులు దినేష్ స్వామి, శ్రీ సాలగ్రామ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వహణ మండలి సభ్యులు డాక్టర్ వేణుగోపాల్, మేడసాని సురేందర్ నాయుడు, రూపేష్, దీప, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో నిశాంత్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పుత్తూరు పెట్రోల్ బంకు ఎన్ఒసికి లక్ష రూపాయలు డిమాండ్ చేసినట్లు తేలడంతో రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫిర్యాదు మేరకు విచారించగా లంచం డిమాండ్ చేసినట్లు తేలింది.





సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన

జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 85 ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్.చత్రప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్.చత్ర ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్, పీజీ కౌన్సిలింగ్‌లో గతంలో 30శాతం మార్కులు వేసే విధంగా ఉండేదని, జీవో నెంబర్ 85 తో 15 శాతానికి పరిమితమవుతున్నదని వివరించారు. వెంటనే ఈ జీవోను రద్దుచేసి గతంలో లాగానే పీజీ కౌన్సిలింగ్ చేపట్టాలని కోరారు. అలాగే ఆరేండ్లు సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి డిప్యూటీ సివిల్ సర్జనులుగా, 12 ఏళ్ల పూర్తి చేసుకున్న వారికి సివిల్ సర్జనులుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రుయా హాస్పిటల్ సిఎస్ఆర్ఎమ్ఓ. డాక్టర్ హరికష్ణ, ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్. కష్ణ చైతన్య, కోశాధికారి. డాక్టర్ వికాస్, సభ్యులు డాక్టర్ .కళ్యాణ్ రెడ్డి, డాక్టర్ పవిత్ర, డాక్టర్ లి నా కుమారి, డాక్టర్ శ్రీ లక్ష్మి, డాక్టర్. తేజస్విని పాల్గొన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి. డాక్టర్ శ్రీహరికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారి డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ డాక్టర్లు యొక్క డిమాండ్లను ప్రభుత్వం దష్టికి తీసుకెళతానన్నారు.

మద్యం షాపుల కేటాయింపులో రిజర్వేషన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

కూటమి ప్రభుత్వం రూపొందించిన నూతన మద్యం పాలసీ ద్వారా కేటాయించే షాపుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి వైసిపి ఎస్సీ సేవాదళ్ నాయకుడు తలారి రాజేంద్ర విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లు ద్వారా షాపులను కేటాయిస్తే ఎంతోకొంత ఎస్సీ, ఎస్టీలకు లబ్ధిచేకూరుతుందని, ఆ దిశగా ప్రభుత్వ పెద్దలు నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాజశేఖర్, వంశీ, విజయ్, సంజీవి, వాసు పాల్గొన్నారు.

100 రోజుల పాలనలో బీసిలకు పునర్జీవం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో రాష్ట్రంలోని బీసిలకు పునర్జీవం వచ్చిందని తిరుపతి టీడీపి పార్లమెంట్లు బీసి సెల్ అధ్యక్షులు రుద్రకోటి సదాశివం అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో బీసిలకు తీరని అన్యాయం చేశారని, 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్కరికి కూడా రుణాలు ఇవ్వలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో బీసిలకు రక్షణ చట్టం, చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇలా అనేక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో విశ్వనాథం. అశోక్ పాల్గొన్నారు.

షాపింగ్‌మాల్స్‌లో కూర్చునే సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, పుత్తూరు టౌన్

షాపింగ్‌మాల్స్‌లో శ్రామిక మహిళలు కూర్చునే సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ తిరుపతి సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ఎదుట శుక్రవారం ఉదయం శ్రామిక మహిళా కమిటీ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఏసీ మాల్స్‌లో కనిపించే శ్రామిక మహిళల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. కనీసం కూర్చోడానికి కుర్చీలు కూడా లేవన్నారు. రాష్ట్రంలోని షాపింగ్‌మాల్స్ అన్నింటిలోనూ శ్రామిక మహిళలు కూర్చునే సౌకర్యాన్ని చంద్రబాబు ప్రభుత్వం కల్పించాలని, ఇందుకు చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఆర్.లక్ష్మి మాట్లాడుతూ తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కూర్చోడానికి హక్కుగా చట్టం చేశారన్నారు. తిరుపతిలో కుర్చీలు లేకపోగా, బాత్రూమ్‌లు, విశ్రాంతి గదులు లేవని, కనీసం బట్టలు మార్చుకునే వీల్లేదన్నారు. భోజనం చేసే సౌకర్యం లేదన్నారు. నిత్యం నిల్చునే విధులు నిర్వహించడం వల్ల నెలసరి సమస్యలతో పాటు, కాళ్లపై వెరికోసిస్ వ్యాధులు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, పి.సాయిలక్ష్మి, జయంతి, మునిరాజా, సుబ్రమణ్యం, వేణుగోపాల్, బుజ్జి, పార్థసారథి, సుజాత, రాజేశ్వరి పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్‌లో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు. షాపింగ్‌మాల్స్‌లో పనిచేసే కార్మికులు కూర్చునే సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ విధులు నిర్వహించడం వల్ల 12 గంటల పాటు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యాషన్‌బాష, కృష్ణమూర్తి, విజయ్, అరుణకుమార్ పాల్గొన్నారు.



తిరుపతి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఎదుట నిరసన



ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, విద్యార్థినివిద్యార్థులు

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: పిచ్చాటూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నారాయణవనం మండలం అరణ్యకండ్రిగ సచివాలయ పరిధిలోని జడ్‌పి హైస్కూలులో పౌష్టికాహార మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ శోభారాణి రక్తహీనత, బాల్య వివాహాల నష్టాలు, పోషకాహారంపై అవగాహన కిషోర బాలికలకు కల్పించారు. ఐసిడిఎస్ సూపరు వైజర్ సి బేబీ హైస్కూల్లో ఇచ్చే గుడ్డు, రాగి జావ, పౌష్టికాహారం వృథా కాకుండా తినాలని సూచించారు. అనంతరం బాలబాలికలతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం కృష్ణమూర్తి, టీచర్స్ బాలాజీ, రాంబాబు, నిర్మల, శ్రీనివాసులు, వనజ, వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్స్ ఎంఎస్‌కే పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈవో సనత్ కుమార్ , ఎంపీడీవో వెంకటేశ్వరరావు క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో మెలగాలని పేర్కొన్నారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్ క్రీడలకు సంబంధించి క్రీడా పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను నియోజకవర్గ క్రీడలకు ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల పీడీలు, పిఈటిలు, క్రీడాకారులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ సాధించిన విజయాలను 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ముద్రించిన కరపత్రాలను గూడూరు రూరల్ పరిధిలోని తిప్పారప్పాడులో ఎంపిడివో వెంకటేశ్వర రావు , స్థానిక టిడిపి నాయకులు కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అండగా డిఎస్సీ నోటిఫికేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. పెన్షన్ పెంపు, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పన, ఐదు రూపాయలకు అన్న క్యాంటీన్‌లను పునః ప్రారంభం, విజయవాడ వరద బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు దుద్దా రాఘవ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరులో తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యారమాపు హేమంత్ కుమార్ రెడ్డి , ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి , ముప్పాల గిరి రెడ్డి , శ్రీనివాసులు , వెంకటేశ్వర్లు , అంకమ్మ , స్థానిక నాయకులు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ పంచాయితీ ఎంపీడీవో త్రివిక్రమరావు పంచాయతీ కార్యదర్శి ఇందిర మండల అధికారుల సమక్షంలో టిడిపి, కూటమి నాయకులు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

సిఐటియు మండల కన్వీనర్‌గా దేవరాజా ఆచార్య



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సిఐటియు వడమాలపేట మండల కన్వీనర్ గా దేవరాజు ఆచారిని ఎన్నుకున్నారు. వడమాలపేట సిఐటియు కార్యాలయంలో సిఐటియు ప్రజా సంఘాల నాయకులతో కలసి సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్, సిఐటియు జిల్లా నాయకులు బాలసుబ్రహ్మణ్యం, వై నందయ్య ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిఐటియు మండల కన్వీనర్ గా దేవరాజు ఆచారి, కమిటీ సభ్యులుగా అంగన్‌వాడీ నుంచి గంగులమ్మ, కృష్ణవేణి, జయంతి, చంద్రమ్మ, వీఆర్ఏల నుంచి, దామోదరం, లోకనాథం, సంఘమిత్ర నుంచి, సుభద్రమ్మ, కమల, రుక్మిణి, పంచాయతీ వర్కర్స్ నుంచి శ్రీనివాసులు, చిరంజీవి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జయ రామయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఢిల్లీబాబు



ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా బి ఢిల్లీబాబును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఢిల్లీబాబు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్ వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవడంతో ఈ స్థానం ఖాళీ అయ్యింది. ఈ కారణంగా వడమాలపేట జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఢిల్లీ బాబుకు పిచ్చాటూరు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బాధ్యతలు ప్రభుత్వం అప్పగించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు అందరి సహకారంతో కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలకు కుర్చీల వితరణ

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలోని టిడిపి నాయకులు వంట్రంగం అరుణ్ కుమార్, చరణ్ రెడ్డిలు దాతృత్వం చాటుకున్నారు. మహాత్మ జ్యోతిరావ్ పూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాల కంప్యూటర్ ల్యాబ్ కి సంబంధించి తమ వంతుగా కుర్చీలను ప్రిన్సిపాల్ నారాయణకు అందించామని వారు తెలిపారు. అరుణ్ కుమార్, చరణ్ రెడ్డి లకు బీసీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

మహిళా వర్సిటీలో ప్రీ ఆర్మీ సెలెక్షన్స్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, తిరుపతి ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రీ ఆర్మీ సెలెక్షన్స్ నిర్వహించారు. ఈ సెలెక్షన్స్ స్టేట్ ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ ఎమ్ రామకృష్ణ, సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రిపబ్లిక్ డే పెరేడ్ కు వెళ్లడం మంచి అవకాశమని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఉద్దేశించి రామకృష్ణ తెలిపారు. ఈ ఎంపికకు 58 మంది వాలంటీర్లు హాజరయ్యారు. వీరి ఆధ్వర్యంలోనే స్వచ్ఛతా సేవలో భాగంగా గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. విశ్వ విద్యాలయం ఇన్‌ఛార్జ్ విసి ఆచార్య వి ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజని అభినందనలు తెలిపి, వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఆచార్య విద్యావతి, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ యువశ్రీ, వజీహాబాను, డాక్టర్ స్వాతి, గాయత్రి పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో ఆహారపు మేళా

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని గృహ విజ్ఞాన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార మాసోత్సవం సందర్భంగా ఆహారపు మేళాను శుక్రవారం నిర్వహించారు. పోషకాహార మాసోత్సవ సందర్భంగా నిర్వహించిన ఫుడ్ అండ్ హెల్త్ మేళాలో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ముఖ్యంగా ఎంఎస్సి హోమ్ సైన్స్, ఇంటిగ్రేటెడ్ ఫుడ్ టెక్నాలజీ, బి వొకేషనల్ న్యూట్రిషన్ అండ్ హెల్త్ కేర్ సైన్సెస్, ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ వీసి ఆచార్య ఉమ, రిజిస్ట్రార్ ఎన్ రజని, సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ వాణి, సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సుజాతమ్మ, హోమ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బిందు, ప్రొఫెసర్ ఏ అరుణ, ప్రొఫెసర్ విజయ్ జ్యోతి, డాక్టర్ శిరీష, ఇతర వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సులోచనమ్మకు పరామర్శ

ప్రజాశక్తి -నాయుడుపేట: నాయుడుపేట ఎస్ జె జ్యువెలరీ అధినేత పోట్లపూడి రాజేష్ తల్లి సులోచనమ్మను మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం శుక్రవారం పరామర్శించారు. సులోచనమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరు నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకొని చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మెడికవర్ హాస్పిటల్ కు చేరుకొని ఆమెను పరామర్శించారు. సులోచనమ్మ పూర్తి ఆరోగ్యవంతురాలుగా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పలువురు టిడిపి నేతలు ఉన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

జాతర నిర్వహణ ఏర్పాట్ల సమావేశంలో జెసి



సమావేశంలో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి- వెంకటగిరి-డక్కిలి: వెంకటగిరి పోలేరమ్మ జాతరను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ పేర్కొన్నారు. పట్టణంలోని పింజల వీరయ్య కళ్యాణ మండపంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసి శుభం భన్సాల్ మాట్లాడుతూ అధికారులకు నిర్దేశించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ సామాన్య భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అధికారులను, జాతర కమిటీ నిర్వాహకుల సభ్యులను సమన్వయం చేసుకుని జాతర విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గూడూరు సబ్ కలెక్టర్ రామవేంద్రమి మాట్లాడుతూ జాతర నిర్వహణలో దేవాదాయ, పోలీసు, ఎక్సైజ్, అగ్నిమాపక, ఆర్టీసీ, విద్యుత్, మున్సిపల్, ఆర్ అండి, విద్య, వైద్య, రెవెన్యూ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గూడూరు డిఎస్పి రమణకుమార్ మాట్లాడుతూ జాతర బందోబస్తుకు 1200 మంది పోలీసులను నియమించి క్లస్టర్లుగా విభజిస్తామని తెలపారు. జేబు దొంగల నివారణకు మఫ్టీలో కొందరు పోలీసులను నియమిస్తా మన్నారు. రిజర్వుడ్ పార్టీని పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. తిరుపతి ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానకిరామ్ మాట్లాడుతూ పూర్తిగా మద్యపానం నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 25,26 తేదీల్లో వెంకటగిరి పట్టణం సమీపంలో బ్రాందిషాపులు అన్ని 48 గంటల పాటు మూసివేస్తామని తెలిపారు. పట్టణ సరిహద్దు ప్రాంతాల్లో తను అధికారులతో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వెంకటగిరి డిపో మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ వెంకటగిరి డిపో నుండి అదనంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామని ప్రస్తుతం 80 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటుతో పాటు ఆత్యవసర అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచనున్నట్లు వైద్యశాఖ అధికారులు తెలిపారు. దేవాదాయశాఖ, మున్సిపల్ శాఖ , ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి రవి మనోహరాచారి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, ఎంపిపి తనుజారెడ్డి, దేవాదయశాఖ ఈవో శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, సీఐ ఏవీ రమణ పాల్గొన్నారు.

ఎస్‌వియూ క్యాంటీన్ టెండర్ల ఖరారు

ప్రజాశక్తి- క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అన్నపూర్ణ, సంపూర్ణ క్యాంటీన్లకు టెండర్లు పిలిచి శుక్రవారం దరఖాస్తులను పరిశీలించి, అత్యధికంగా కొటేషన్ చేసిన వారికి క్యాంటీన్ల నిర్వహణను అప్పగించారు. ఎస్వీయూ కుల సజీవుల కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలించి, అత్యధికంగా దరఖాస్తు కొటేషన్ చేసిన జయశేఖర నాయుడుకు రెండు క్యాంటీన్లను అప్పగించారు. అన్నపూర్ణ క్యాంటీన్ కు ఒక లక్ష పదివేల రూపాయలు నెలకు బాడుగగా నిర్ణయించగా, సంపూర్ణ క్యాంటీన్ కు 45 వేల రూపాయలు నెలకు బాడుగగా అత్యధిక కొటేషన్ చేసిన జయ శేఖర్ నాయుడుకు టెండరును ఖరారు చేశారు. ఎంతో కాలంగా వర్సిటీ క్యాంటీన్లు మూతపడి ఉండటం విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది తీరా ఇబ్బందులకు గురయ్యారు. దీంతో వర్సిటీకి కొంతమేరకు ఉపశమనం కలిగిందని సకాలంలో భోజన ఇతర సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని వర్సిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. నూతన క్యాంటీన్లో నాణ్యమైన భోజనం, టిఫిన్ టెండర్ లో పలికిన ధరలకు అందుబాటులోకి తీసుకొస్తాయని విద్యార్థి సంఘం నేతలు ఆశిస్తున్నారు.

శ్రీసిటీ సీఎఫ్‌ఓకు సిఐఐ 'సీఎఫ్‌ఓ ఎక్సలెన్స్' అవార్డు

ప్రజాశక్తి- సత్యవేడు: శ్రీసిటీని మరో ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సంస్థ వారి సీఎఫ్ఓ ఎక్సలెన్స్ అవార్డ్' శ్రీసిటీ చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) ఆర్.నాగరాజన్ కు దక్కింది. గురువారం బెంగుళూరులో నిర్వహించిన సదరన్ రీజియన్ సిఐఐ సీఎఫ్ఓ ఎక్సలెన్స్ అవార్డుల మూడవ ఎడిషన్ కార్యక్రమంలో ఈ అవార్డును అందించారు. సిఐఐ మాజీ ప్రసిడెంట్, ఇన్ఫోసిస్ కో-ఫౌండర్, యాక్సిలర్ వెంచర్స్ ఛైర్మన్ క్రిస్ గోపాలకృష్ణన్, సిఐఐ సిఎఫ్ఓ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2023-2024 ఛైర్మన్, భారత్ వోల్వో గ్రూప్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ కమల్ బాలి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. మౌలిక వసతుల కల్పన రంగంలో ఆర్థిక నిపుణుడుగా తాను చూపిన అసాధారణమైన ప్రతిభ, కృషికి గుర్తింపుగా ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈ ప్రతిష్టాత్మిక అవార్డు గెలుచుకోవడం తమకు చాలా గర్వంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు.

డిప్యూటీ సీఎంను కలిసిన హరిప్రసాద్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను చిత్తూరు ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ శుక్రవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం కావడానికి కృషి చేయాలని హరిప్రసాద్ కు సూచించారు. హరి ప్రసాద్ మాట్లాడుతూ 100 రోజుల పాలనలో సంతృప్తిగా ఉన్నారని ప్రజలు భావిస్తున్నారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జనసేన బలోపేతం కావడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయనకు తెలిపారు.

నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలి: ఐటిఐ ప్రిన్సిపల్

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ వి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజ్, సిడాప్, డిఆర్‌డిఏ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతిలోని గవర్నమెంట్ ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి నెలా ఇంటి జాబ్ మేళాలు గవర్నమెంట్ ఐటిఐ కాలేజీలో నిర్వహిస్తున్నామని ఈ సదవకాశాన్ని జిల్లాలో యువతీ, యువకుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ జాబ్ మేళాకు వివిధ రంగాలకు చెందిన నాలుగు బహుళ జాతీయ కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులు హాజ రయ్యారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్ లోకనాథం మాట్లాడుతూ ఇందులో భాగంగా నేడు జరిగిన జాబ్ మేళాకు 102 మంది యువతీ, యువకుల వివిధ కంపెనీలలో ఇంటర్వ్యూలకు హాజరుకాగా 69 మంది యువతీ, యువకులు వివిధ కంపెనీలలో ఉద్యోగ అర్హత పొందారని తెలిపారు. ఎంపికైన వారందరికీ అభినంద నలు, ఆఫర్ లెటర్లు ముఖ్య అతిథులు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గంగాధరం, ఐటిఐ కళాశాల, ఏ గణేష్, సునేష, ఓ హిమబిందు, శ్రీలక్ష్మి, మహేష్‌లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -కోట : ప్రజలందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. కోట మండలంలోని ఉత్తమ నెల్లూరులో టిడిపి నాయకులు జంగిటి కృష్ణయ్య ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం 'ను శుక్రవారం నిర్వహించారు. తాటిగుంట చెరువు గిరిజన కుటుంబాలకు సమీపంలో ఉన్న రోడ్డు పక్కన జంగిటి కృష్ణయ్య సొంతంగా నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే సునీల్ కుమార్ వంద రోజుల పాలనలో సాధించిన విజయాలను వివరించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు వుంటే తమకు తెలిపితే పరిష్కరిస్తానని తెలిపారు. గతంలో చిట్టేడులో గిరిజనులకు శ్మశాన స్థలం లేదని, గత ప్రభుత్వ హయాంలో ఓ వ్యక్తి శ్మశానాన్ని ఆక్రమించాడని ఆరోపించారు. ఈ విషయం తహశీల్దారు వెంటనే స్పందించి ఆ స్థలంలో అర ఎకరా శ్మశానాన్ని కేటాయించారని స్థానికులు గుర్తు చేశారు. ఉత్తమ నెల్లూరు పంచాయతీలో అర్హులైన నిరుపేదలకు వంద పక్కా గృహాలను మంజూరు చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మద్దాలి సర్వోత్తమ రెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, పలగాటి భాస్కర్ రెడ్డి, జలీల్ అహ్మద్,కోటారెడ్డి నెల్లూరు మోహన్ రెడ్డి, కొనిశెట్టి రమేష్,తీగల సురేష్ బాబు,దారా సురేష్ కోకర్ల మధు యాదవ్, పొక్కాళి సుధాకర్ శెట్టి, బాలాజీ శెట్టి, జంగిటి కృష్ణయ్య, ఆకుల ప్రసాద్ యాదవ్, రవీంద్రారెడ్డి, చంగల్ రావు, మురళి, దిలీప్, నౌషద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అన్నీ శాఖాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చేపల చెరువు వేలంపాట వాయిదా

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: ఈ నెల 20వ తేదీ నిర్వహించాల్సిన తొండమనాడు చెరువు వేలంపాట అధికారులు ఎవరూ రాకపోవడంతో వేలంపాట దారులు వెనుదిరిగారు. దీంతో వాయిదా పడింది. మండలంలోని చల్లపాలెం పంచాయతీ రెవెన్యూ పరిధిలోని తొండమనాడు చెరువు వేలంపాట ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు చల్లపాలెం గ్రామ సచివాలయం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఈ నెల 13వ తేదీ అధికారులు ప్రకటన విడుదల చేశారు. చేపల చెరువు వేలంపాట కోసం పంచాయతీలోని ప్రజలు చల్లపాలెం గ్రామ సచివాలయం కార్యాలయం వద్దకు శుక్రవారం చేరుకున్నారు. అధికారులు నిర్ణయించిన సమయం దాటిపోయినప్పటికీ అధికారులు ఎవరూ కార్యాలయంలో కనిపించకపో వడంతో వేలంపాటకు హాజరైన ప్రజలు పంచాయతీ కార్యదర్శి బాలమురళీకి ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకునేందుకు ప్రయత్నించారు. ఫోన్ వెళ్లకపోవడంతో ఏం జరుగుతుందో అర్థం కావడంలేదని వేలం పాటకు వచ్చిన ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో పటాన్ రఫీ ఖాన్‌ను వివరణ కోరగా ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు చేపల చెరువు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ప్రకటిం చిన విషయం వాస్తవమేనని, ఈవోపిఆర్‌డి ప్రభురావు బంధువులు ఆకస్మికం గా మృతి చెందడంతో ఆయన సెలవుపై వెళ్లారని, ఈ కారణంగా చేపల చెరువు వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామో త్వరలోనే ప్రకటన విడుదల చేస్తామని తెలిపారు.

కాకాణిని కలిసిన సాయిప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి -కోట : మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డిని కోట మండలంలోని చెందోడు పంచాయతీకి చెందిన వైసిపి గూడూరు నియోజకవర్గ యువత అధ్యక్షులు చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే కాకాని గోవర్ధన్ రెడ్డి జిల్లా అధ్యక్ష పదవిని దక్కించుకోవడంతో ఈ సందర్భంగా ఆయనను కలిసి అభినందనలు తెలిపామని చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. కాకాని గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పార్టీ మరింత బలోపేతం కావడానికి వచ్చే ఎన్నికల్లో మంచి మెజార్టీ వచ్చేలా తామంతా కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు.

'ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించాలి '

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించాలని సంవత్సరానికి రెండు వందల పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పి శ్రీనివాసులు కోరారు. గూడూరు వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం 21 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని, ఉపాధి పనులు సంవత్సరంలో రెండు వందల రోజులు పని కల్పించాలని, రోజువారి వేతనం ఆరు వందల రూపాయలు ఇప్పించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు జీవనాధారం పెంచేందుకు ఉపాధి పనుల రోజుల సంఖ్యను పెంచాలని సూచించారు. అనంతరం గూడూరు మండలం వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని 21 మందితో ఎన్నుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నూతన అధ్యక్ష కార్యదర్శులుగా వెంకటయ్య, నారాయణను ఎన్నుకున్నారు.



ఎన్నికైన గూడూరు మండల వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ సభ్యులు

'మాతా శిశుమరణాల నివారణే లక్ష్యం'

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్సు అధికారి డాక్టర్ శ్రీనివాసరావు నేతృత్వంలో జిల్లా గణాంక అధికారి నాగేంద్ర కుమార్, సూపర్ వైజర్ నరేష్ బాబు ఎంపి హెచ్ఎస్, డిపిఓ ప్రకాష్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెట్లూరు సచివాల యాన్ని శుక్రవారం సంద ర్శిం చి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్ల లు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో మరణించకూడదని తగిన వైద్య సదుపాయలు అందించాలన్నారు. ప్రతి ఒక కాన్పు ప్రభుత ఆస్పత్రిలో జరిగేలా చూడాలన్నారు. ఏఎన్ఎం, ఎమ్మెల్ హెచ్‌పి రికార్డులను పనితీరును పరిశీలించి మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సూపర్ వైజర్ నరేష్ బాబు(ఎం పిహెచ్ ఎస్), వైద్యాధికారి డాక్టర్ రెడ్డి ప్రసాద్ సూపర్‌వైజరు, ఏఎన్ఎంలే, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'ప్రజా వేదిక'ను జయప్రదం చేయండి: ఎంపిడివో

రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి నియోజక వర్గ ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) ఆధ్వర్యంలో చంద్రగిరి మండలంలోని చంద్రగిరి గ్రామ పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం నిర్వహించనున్న 'ప్రజా వేదిక' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపిడివో బాలాజీ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రామచంద్రాపురం మండలంలోని కొత్త వేప కుప్పం గ్రామ పంచాయతీలో శనివారం మధ్యాహ్నం 'ఇది మంచి ప్రభుత్వం'ను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు నాని ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండల పరిధిలోని చందనముడి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జై భీమ్ ట్రస్ట్ సహకారంతో విద్యార్థులకు శుక్రవారం పౌష్టికాహారం అందించారు. జై భీమ్ ట్రస్ట్ వైస్ ఛైర్మన్ మల్లేపల్లి సంధ్యాదేవి గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెలా విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. అందులో భాగంగా చికెన్, వడ, పెరుగు, అరటి పండ్లు వడించారు. గ్రామంలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు, ట్రస్ట్ ఫౌండర్, ఛైర్మన్, ప్రధానోపాధ్యాయులు యంవి శేషయ్య రక్తహీనతతో బాధపడుతున్న ఖర్జూరం, వేరుశనగ, నువ్వుల ముద్దలను గ్రామ సర్పంచ్ బండి అరుణమ్మ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ మాట్లాడుతూ తమ జై భీమ్ ట్రస్ట్ ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారం అందిస్తామన్నారు. పేద విద్యార్థులను గుర్తించి వారికి విద్యా సామగ్రి ఉచితంగా అందిస్తామని, యూనిఫామ్ అందించడం, తదితర కార్యక్రమాలు నిర్వ హిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ వెంకట రమణమ్మ, వైస్ ఛైర్మన్ వెంకయ్య, సమీప పాఠశాలల ఉపాధ్యా యులు హుస్సేన్ బాబు, శ్రీనివాసులు, సతీష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఆటోనుంచి జారిపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి- రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి మండలం మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన ఊరగాయల చంద్రశేఖర్ రెడ్డి (45) గత సోమవారం ఆటో నుంచి జారి పడటంతో తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. తిరుపతి లోని ఓ ప్రైవేట్ లాడ్జ్ లో పనిచేస్తున్న చంద్రశేఖర్ రెడ్డి సోమవారం విధులు ముగించుకుని తిరుపతి నుండి మల్లయ్య పల్లెకు ఆటోలో తిరిగు ప్రయాణం అయ్యాడు. చంద్రగిరి హీరా కాలేజీ సమీపంలో ఆటోలో వెనక కూర్చొని ప్రయాణిస్తుండగా చంద్రశేఖర్ రెడ్డి కాలుజారి పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం 108 సాయంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం కుటుంబ సభ్యులు అదేరోజు తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం ఉదయం చనిపోయినట్లు కుటుంబ సభ్యులు పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: బాగా చదవలేదని తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుండి పారిపోయిన ఇద్దరు బాలికలను అలిపిరి పోలీసులు పట్టుకొని శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారు. అలిపిరి పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రాఘవేంద్రా నగర్, జీవకోనలోని వెంకటగిరి స్కూలులో 10 వతరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు, తమ తల్లిదండ్రులు సరిగా చదవడం లేదని మందలించడంతో ఇంటి నుండి అలిగి ఎటో వెళ్లిపోయారు. వారి తల్లిదండ్రులు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రామకిషోర్ ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి వారిని వెతికారు. సెల్‌ఫోను ఆధారంగా వారు విజయనగరం జిల్లా, పార్వతి పురంలో సంచరిస్తున్నట్లు గుర్తించారు. ఏఎస్ఐ పద్మావతి ద్వారా ఆ బాలికలను క్షేమంగా తిరుపతికి తీసుకువచ్చి, 24 గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ రైడర్‌పై కేసు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: బైకుపై స్టంట్ చేస్తూ అతివేగంగా ద్విచక్ర వాహనం నడుపుతున్న యువకుడిని అదుపులోకి తీసుకొని బండిని సీజ్ చేసినట్లు అలిపిరి సీఐ రామ్ కిషోర్ తెలిపారు. అలిపిరి పోలీస్ స్టేషన్లో శుక్రవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి ఎస్పి ఎల్ సుబ్బరాయుడు ఆదేశం మేరకు తిరుపతి డిఎస్పి వెంకటనారాయణ పర్యవేక్షణలో అలిపిరి పోలీసులు శుక్రవారం సాధారణ తనిఖీలు నిర్వహించారు. తిరుపతి మంచాల వీధికి చెందిన డి రాఘవేంద్ర రోహిత్ యమహా ఆర్15 మోటార్ సైకిల్ ను తిరుపతి పట్టణంలో లైసెన్స్ లేకుండా అతివేగంగా బైక్ తోలుతూ ప్రమాదకరమైన విన్యాసాలు, విచిత్రమైన చేష్టలతో వింత శబ్దాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ శబ్ద కాలుష్యం చేస్తూ పిల్లలకు, పెద్దలకు ప్రాణహని కలిగేలా తోలుతూ అలాంటివి వీడియోతీసి చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న అతడిని పట్టుకుని, అతని వద్ద ఉన్న వాహనాన్ని సీజ్ చేశామన్నారు. యువకుడిని, బండిని ఆర్టీవోకి అప్పగించామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - తడ: తడ మండలంలోని అక్కంపేట వద్ద 41,950 కేజీల రేషన్ బియ్యంను తడ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. తడ పోలీసుల కథనం మేరకు ఎస్ఐ తన సిబ్బంది, సివిల్ సప్లై డిటి ఓబయ్య కలసి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో అక్కంపేట ఖాశినేరు కండ్రిగ నుండి రెండు పెద్ద లారీలలో తరలిస్తున్న 41,950 కేజీల తమిళనాడు రేషన్ బియ్యంను పట్టుకుని లారీ డ్రైవర్‌లు చంద్రశేఖర రావు, దుర్గా రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. ఈ బియ్యంను చెన్నై నుండి చత్తీస్ ఘడ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ బియ్యం విలువ సుమారు 12లక్షల58వేల500 రూపాయలు వుంటుందని తెలిపారు. లారీ ఓనర్స్ కేవీరెడ్డి, ప్రసాద్, మణికంఠలపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

గంజాయి స్వాధీనం

ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో తిరుపతి నగరంలో గంజాయిని విక్రయిస్తున్న వారిపై మాటు వేసి అలిపిరి పోలీసులు ఐదుగురిని అదుపులో తీసుకున్నట్లు అలిపిరి సీఐ రామ కిషోర్ తెలిపారు. అలిపిరి పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జీవకోనలో ఉంటూ మేస్త్రి పని చేసుకుంటున్న ఎల్ హరిబాబు (20), జీవకోనకు చెందిన గోపీచంద్ (19), వి ఇస్రాయిల్ (22), ఎల్. చందు (19) తో పాటు మరో బాల నేరస్థుడు గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి అక్రమంగా విక్రయించేవారు. పోలీసులు వీరిపై నిఘా ఉంచి శుక్రవారం రెడ్ హ్యాండ్‌గా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2.7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వారిని రిమాండుకు తరలించినట్లు సిఐ పేర్కొన్నారు.

టూవీలర్ మెకానిక్ సమస్యలపై సమావేశం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మెకానిక్స్ ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి రావలసిన లబ్ధిపై శుక్రవారం తిరుపతి నగర పరిధిలోని యూత్ హాస్టల్‌లో కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ లాలప్ప, అధికారులతో శ్రీ బాలాజీ టు వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పి మోహన్ ఆధ్వర్యంలో చర్చా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మోహన్ మాట్లాడుతూ కార్మిక శాఖ ద్వారా నగరంలో పనిచేస్తున్న టూవీలర్ మెకానిక్‌లకు రావలసిన లబ్ధి, అధికారుల వల్ల ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించామన్నారు. అసోసియేషన్ సభ్యులకు ఈఎస్ఐ సౌకర్యాలు, రవాణా శాఖ ద్వారా లైసెన్సులు పొందేలా కార్యాచరణపై చర్చించామన్నారు. కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ లాలప్ప మాట్లాడుతూ నగరంలో కార్మిక శాఖ నిబంధనల మేరకు టూవీలర్ మెకానిక్‌లు నడుచుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి హరి ప్రసాద్, ఉపాధ్యక్షులు చందు, కోశాధికారి విశ్వనాథ్, జాయింట్ సెక్రెటరీ షఫీ, సలహాదారు గోపి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి మందుల వితరణ

ప్రజాశక్తి -రేణిగుంట: విప్పమాని పట్టెడ గ్రామ పంచాయతీలోని వేమాపురం సంజీవరెడ్డి కాలనీలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు లక్ష్మీపతి రెడ్డి అత్యవసర మందులు శుక్రవారం ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అవసరమైన సేవలు అందించడానికి తమ సొసైటీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, అందరికీ సేవ చేస్తుందన్నారు. అకాల విష జ్వరాలు, డెంగీ, మలేరియా వంటి వాటికి అత్యవసర మందులను ప్రభుత్వ వైద్యశాలకు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది , సొసైటీ సిబ్బంది , సొసైటీ అధ్యక్షులు లక్ష్మీపతి రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం జీవకోన పరిధిలోని రాజీవ్ గాంధీ కాలనీ గంగమ్మ గుడి వద్ద నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్, సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, అన్నా రామకృష్ణ, అన్నా అనిత, మహేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.